క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొల్లిపర: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగించుకోవాలని సర్పంచి బాణావత్ అరుణాబాయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తూములూరు పంచాయతీ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ ద్వారా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరుణాబాయి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసమే గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులందరూ గృహాలు నిర్మించుకోవాలన్నారు. గ్రామసభలో తహసీల్దార్ నాంచారయ్య, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఉపసర్పంచి మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీలు అవుతు బసవపున్నారెడ్డి, మర్రెడ్డి మాధవి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలి అర్బన్: తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని తిరుపతమ్మ గుడి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్యవైశ్య లీగల్ సెల్ చైర్మన్ దర్శి శివకోటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్లు మద్దాలి శేషాచలం, ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, నాయకులు వంకదార శివసుధాకర్, మాలేపాటి తిరుమలేశ్వరరావు, సీవీ రమణ, వెచ్చా నాగరాజారావు, కోలా గురునాథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

తెనాలి రూరల్: జాతీయ లోక్ అదాలత్ మే 13వ తేదీ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కుటుంబ కలహాలు, వినియోగదారుల కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. తెనాలి కోర్టుల ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అదాలత్ జరుగుతుందని జడ్జి చెప్పారు.

షాపు లీజుకు బహిరంగ వేలం

తెనాలి టౌన్: పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ ఓంకార ఆశ్రమానికి చెందిన గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి గుడి వీధిలోని షాపు లీజుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. షరాఫ్ బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో దేవదాయశాఖ అధికారులు నిర్వహించిన వేలంలో హెచ్చుపాటను ఆర్.విద్యాధర్ పాడారు. నెలకు రూ.22వేలు అద్దె చెల్లించే విధంగా పాట పాడినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవదాయశాఖ ఈఓ జి.అమర్‌నాథ్ పాల్గొన్నారు.

బాలోత్సవం ఆధ్వర్యంలో మ్యాజిక్‌లో శిక్షణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో మే ఐదు నుంచి 14వ తేదీ వరకు మ్యాజిక్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు బాలోత్సవం ఉపాధ్యక్షులు జీఎస్ఆర్ మోహనరావు తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓ పాఠశాలలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను మ్యాజిక్ నేర్చుకోవడానికి వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మ్యాజిక్ నేర్చుకోవడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ మ్యాజిక్ రంగంలో ప్రపంచ రికార్డు సృష్టించిన ప్రఖ్యాత ఇంద్రజాలికులు క్రాంతికుమార్ ప్రత్యేక పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, మ్యాజిక్‌లో శిక్షణ పొందగోరే వారు వెయ్యి రూపాయలు రుసుం చెల్లించాలని అన్నారు. పాల్గొనే విద్యార్థులు ముందుగా తమ పేర్లు 6301217365, 9866029486 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కార్యదర్శి కె.శ్రీలక్ష్మి, పలు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, బాలోత్సవం నిర్వాహకులు బిట్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామికి మాస శివరాత్రి పూజలు



చేబ్రోలు: స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైత్రమాస మాస శివరాత్రి సందర్భంగా స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆర్.సత్యనారాయణశర్మ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి చర్యలు

ఎమ్మెల్యే శివకుమార్



మసీదులో జరిగిన ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులోని మసీదులో జరిగిన ప్రార్థనల్లో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు పెద్దలు ఎమ్మెల్యేను శాలువాలు, టోపీలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రంజాన్ పండుగ నాటికి ఈద్గాలో జరుగుతున్న పనులను పూర్తి చేస్తామన్నారు. శుభకార్యాలు ఏర్పాటుకు గ్రామంలో షాదీఖానాను నిర్మిస్తామన్నారు. తొలుతగా ఎంపీటీసీ–1 సభ్యురాలు వీరమల్లు కార్తికేయ, నాగేదేవిక దంపతులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మసీదు ఇమామ్, షేక్ లియాఖత్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, అమీర్‌బాషా, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ బాజీ, సెక్రటరీ అజమల్, కార్తికేయ, కోడూరు లూకా, కొలకలూరి నాగేశ్వరరావు, పినపాటి అనిల్, ముస్లిమ్ పెద్దలు, జానీ, జిలాని, తదితరులు పాల్గొన్నారు. తెనాలి చెంచుపేటలోని ఈద్గాలో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు.

తెలుగు మహనీయుల కోవలో జగన్



మాజీ ఎమ్మెల్యే శివరామకృష్ణారెడ్డి

తెనాలి: ఆంధ్రప్రదేశ్‌లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరాభిమానాలు వెలకట్టలేనివని మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామగ్రామాన గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు సారథ్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి, గౌరవ ముఖ్యమంత్రి పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని విశదీకరించిన సందర్భంగా ప్రజలు మనస్ఫూర్తిగా మద్దతునిస్తున్నారని తెలిపారు. ఏపీలో జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోనే జరగొచ్చని అభిప్రాయపడ్డారు. విశిష్ట సేవలందించిన తెలుగు మహనీయులు నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు కోవలో మూడో తెలుగు వ్యక్తిగా జగన్‌మోహన్‌రెడ్డి ఆ స్థాయికి ఎదుగుతారని శివరామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ తరంవారికే కాకుండా భావితరాలు స్మరించుకునే విధంగా ఒక చరిత్రకారుడిగా నిలుస్తారనేది తన భావనగా వివరించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి



ర్యాలీలో పాల్గొన్న శివసాంబిరెడ్డి, వెంకటేష్ తదితరులు

తెనాలిఅర్బన్: మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని కేంద్రం నుంచి గద్దె దింపాలని సీపీఎం తెనాలి డివిజన్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా జరుగుతున్న ప్రచారభేరి మంగళవారం కొనసాగింది. పట్టణంలో నాయకులు ర్యాలీ నిర్వహిస్తూ బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్, ఏఐవైఎఫ్ నాయకులు పల్నాటి నాగరాజు, బిళ్ళ రాజేష్, సీపీఎం నాయకులు హుస్సేన్‌వలి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న డీఎస్పీ స్రవంతిరాయ్

తెనాలి రూరల్: ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను చేసుకోవాలని డీఎస్పీ కె.స్రవంతిరాయ్ సూచించారు. పట్టణ గాంధీ చౌక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు మంగళవారం రాత్రి ఆమె మెయిన్ రోడ్డును పరిశీలించారు. నడుచుకుంటూ వెళ్లి తోపుడు బండ్లు, రోడ్డు వెంబడి బుట్టలతో వ్యాపారం చేసే వారితో మాట్లాడారు. పట్టణంలో ప్రధానమైన, అత్యంత రద్దీ ఉండే మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బంది లేకుండ చూడాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ వెంట వన్‌టౌన్, టూ టౌన్, సీపీఆర్ సీఐలు కె.చంద్రశేఖర్, ఎస్.వెంకట్రావు, కాటూరి వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్ ఉన్నారు.

కొనసాగుతున్న జగనన్నే మా భవిష్యత్



10వ వార్డులో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సామ్రాజ్యం



31వ వార్డులో బుక్‌లెట్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మానసరెడ్డి

తెనాలి అర్బన్: జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మంగళవారం తెనాలి ఉత్సాహంగా సాగింది. 10, 11, 31 వార్డుల వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తిరుమలశెట్టి సామ్రాజ్యం, కఠారి రత్నకుమారి, గోగిరెడ్డి మానసరెడ్డి ఆధ్వర్యంలో గృహసారథులు వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమంపై అవగాహన కల్పించారు. మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమం స్టిక్కర్లు అంటించారు.

జీజీహెచ్ స్టాఫ్ నర్సుకు సన్మానం



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ నీలం ప్రభావతి, పక్కన ఆశా సజని తదితరులు

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీలకు గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సు వేల్పుల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు చెన్నైలో జరిగిన జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పారా వాలీబాల్ క్రీడలో పాల్గొని విజేతగా నిలవడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కజికిస్తాన్‌లో జూలై 3 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న టోర్నీకి హాజరుకానున్నారు. ఈమేరకు మంగళవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ దేశ ఖ్యాతిని విజయ్‌కుమార్ ఇనుమడింప చేయాలనీ ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వాసుపత్రిలో విధి నిర్వహణలో ఎంతో చిత్తశుద్ధితో పనిచేసే విజయ్‌కుమార్ పారా వాలీబాల్ క్రీడకు భారతదేశం తరపున ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషాసజని, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వచ్ఛంద ప్రసాద్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు సమస్యలను ఐక్యంగా పరిష్కరించుకోవాలి



నాగూర్ షరీఫ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ ప్రభావతి, మినిస్టీరియల్ సిబ్బంది

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగూర్ షరీఫ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు(ఆర్డీ) కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్‌ను గుంటూరు జీజీహెచ్ శుశ్రుతహాలులో ఆస్పత్రి మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానించారు. కార్యక్రమానికి మినిస్టీరియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కలిగిన సంఘంలో పదవిని అధిరోహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. శని, ఆదివారాలు ప్రభుత్వ ఉద్యోగులందరికీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో విశేష సేవలందించినందుకు డాక్టర్ ప్రభావతిని అసోసియేషన్ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, సెక్రటరీ ఎస్.సతీష్ కుమార్, కోశాధికారి శ్రీధర్ రెడ్డి, నగర అధ్యక్షుడు సూరి, జీజీహెచ్ ఏడీ సి.హెచ్.నాగేశ్వరావు, ఏ ఓ పూసల శ్రీనివాసరావు, ఆర్డీ ఆఫీస్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, అసోసియేషన్ నాయకులు డి.సాంబశివరావు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ ఫార్మసీలో హీమోఫీలియా దినం

తెనాలి అర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం హీమోఫీలియా దినాన్ని నిర్వహించారు. హీమోఫీలియా వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలను డాక్టర్ గుర్రం ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రొఫెసర్ డి.జ్యోతిబసు, వి.కోటిరెడ్డి, వై.ఫణీకృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

తెనాలి రూరల్: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం.. ఐతానగర్‌కు చెందిన 57 ఏళ్ల మల్లపురం గోవిందు కూలి పనులకు వెళుతుంటాడు. ఈ నెల 10వ తేదీన రైల్వే స్టేషన్ ప్రాంతానికి వచ్చి కనబడకుండ వెళ్లిపోయాడు. గాలించినా ఫలితం లేకపోవడంతో కుమారుడు ఆంజనేయులు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

గుంటూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాలు.. మన్యం జిల్లా పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన దేవర సాయి(30) కోల్డ్ స్టోరేజ్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో నగర శివారుల్లోని కోల్డ్ స్టోరేజ్‌లలో నివాసం ఉంటూ పనిచేసుకుంటున్నాడు. తెల్లవారుజామున మిర్చియార్డు వైజంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై కేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై ఆరు కేసులు నమోదు చేశారు. లీగల్ మెట్రాలజీ శాఖ డెప్యూటీ కంట్రోలర్ షాలేం రాజు ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో పలు వాటర్ ప్లాంట్‌లను మంగళవారం తనిఖీ చేశారు. ప్యాకింగ్ రూల్స్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారిని ఆయిల్‌ట్యాంకర్ ఢీకొనగా మహిళ మృతిచెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఒంగోలుకు చెందిన సి.హెచ్.రోజాకాంతం(52) నల్లపాడు గ్రామంలోని స్మార్ట్ సిటీ కాలనీలో నివసిస్తుంటారు. మంగళవారం సాయంత్రం మనవడికి అనారోగ్యంగా ఉండటంతో భర్త, కుటుంబ సభ్యులు కారులో చికిత్స నిమిత్తం గుంటూరు బయల్దేరారు. అదే విధంగా రోజాకాంతం తన కుమారుడి ద్విచక్ర వాహనంపై గుంటూరు బయల్దేరారు. నల్లపాడు సమీపంలో అతివేగంగా వెనుకగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో కుమారుడు వాహనం రోడ్డుపక్కన పడింది. రోజాకాంతం లారీ టైరు కింద పడి మృతి చెందింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోండి

ఏపీఎస్ ఆర్టీసీ డెప్యూటీ సీఎంఈ శ్రీనివాసరావు



సుబ్రహ్మణ్యానికి ప్రశంసాపత్రం అందజేస్తున్న సీఎంఈ శ్రీనివాసరావు, పక్కన డీఎం రాజశేఖర్

తెనాలి అర్బన్: విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు ఆర్టీసీకి తోడ్పాటు అందించాలని నెల్లూరు జోన్–3 డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెనాలి డిపోను మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో కొద్దిసేపు పలు అంశాలపై చర్చించి సూచనలు చేశారు. అనంతరం ఎక్కువ కేఎంపీఎల్ తెచ్చిన డ్రైవర్ కోలా సుబ్రహ్మణ్యానికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అలాగే వేసవి నేపథ్యంలో ఉద్యోగులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంచే పాఠశాల కాన్వొకేషన్

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



కాన్వొకేషన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్, పక్కన గీతాదత్, మురళీకాంత్, విష్ణుప్రియ

తెనాలి: పాఠశాల స్థాయిలో కాన్వొకేషన్ నిర్వహణ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక బోసురోడ్డులోని నెహ్రూ నికేతన్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన పాఠశాల విద్యార్థుల కాన్వొకేషన్ ఉత్సవాలకు మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యాభ్యాసానికి తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువును ఇష్టపడేలా చూడాలన్నారు. ఇందుకు పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రముఖ టీవీ నటి విష్ణుప్రియ మాట్లాడుతూ స్వర్ణోత్సవంలోకి అడుగు పెడుతున్న నెహ్రూనికేతన్ తన ప్రయాణంలో వేలాది విద్యార్థులను తీర్చిదిద్దటం గొప్ప విషయమన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ రాబోయే విద్యాసంవత్సరం నుంచి అన్ని తరగతులను డిజిటల్ బోధన చేపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే శివకుమార్ విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. వ్యవస్థాపకులు డీఎస్ ప్రకాశరావు, లక్ష్మీప్రకాష్ పాల్గొన్నారు.

కళాకారుడు కుటుంబరావుకు సన్మానం



కుటుంబరావును సన్మానిస్తున్న నారాయణప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు

తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం భట్టివిక్రమార్క చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం నర్తనశాల చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు బోడేపూడి కుటుంబరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాఖమూరి నారాయణప్రసాద్, సోమవరపు నాగేశ్వరరావు, చుక్కపల్లి వెంకటసాంబశివరావు, పెదబాబు, ఫణీదపు దుర్గ, రావిపాటి ప్రసాద్, పెమ్మసానీ పోతురాజు, రావి సూర్యకిరణ్‌తేజ, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, దాసరి నరసయ్య, కాశేవ్వరరావు, నరసింహారావు, పి.రాజు, డి.పోతురాజు, వీరశేఖరరావు, ప్రసాదరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాద సమయంలో మెట్ల మార్గాన్ని వినియోగించాలి



ప్రమాదం జరిగినప్పుడు ప్రజలను తరలించే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

తెనాలి రూరల్: హోటళ్లు, ఇతర వాణిజ్య ప్రాంతాలు/భవన సముదాయల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు లిఫ్టలను వినియోగించకూడదని, మెట్ల మార్గన్నే ఉపయోగించాలని తెనాలి సహాయ జిల్లా అగ్నిమాపకాధికారి కె.కృష్ణారెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌతం గ్రాండ్ హోటల్, ఆటోనగర్‌లోని స్మాల్ స్కేల్ ఇండస్ట్రీల వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వాణిజ్య భవన సముదాల్లో పటిష్ట అగ్నిమాపక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రమాదం సంభవించినప్పుడు నేలపై పడుకుని పాకుతూ ఆయా గదుల నుంచి బయటకు రావాలని సూచించారు. లిఫ్టలను వాడడం వలన ప్రాణ హాని జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. అగ్నిమాపక పరికరాలను ఉపయోగించడంలో మెలకువలను వివరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎంఈఓ లక్ష్మీనారాయణ



విజేతలకు కప్ అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ, డైరెక్టర్ శ్యామ్ బెనర్జీ

తెనాలిఅర్బన్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. షారోన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, తద్వారా శారీరక, మానసిక దృఢత్వం ఏర్పాడుతుందన్నారు. అనంతరం ఆటలు, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కె.శ్యామ్‌బెనర్జీ, ప్రిన్సిపాల్ కె.మేరి బెనర్జీ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్‌ను అభినందించిన ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్



మల్లికార్జునరావుని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం: వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన మల్లికార్జునరావు భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ ఆకాంక్షించారు. ఈనెల 15న తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు చేపట్టగా, సౌత్ ఇండియన్ మాస్టర్స్ వెయిట్ లిఫ్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ మల్లికార్జునరావు బంగారు పతకం సాధించారు. ఈ మేరకు అతన్ని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాలిసెట్ ఎంట్రన్స్ టెస్ట్‌కు శిక్షణ



శిక్షణ తరగతుల పోస్టర్లు విడుదల చేస్తున్న తిలక్‌బాబు, సాంబశివరావు, విజయకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: రోటరీ క్లబ్ ఆఫ్ అచీవర్స్ ఆధ్వర్యంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఈనెల 20 నుంచి పాలిసెట్, ఏపీఆర్‌జేసీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పిడికిటి తిలక్‌బాబు తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో ఉచిత శిక్షణ తరగతులకు సంబంధించిన ప్రచార పోస్టర్లు విడుదల చేశారు. ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు వివిధ సబ్జెక్టుల బోధనతో పాటు ప్రతి రోజూ 90 ప్రశ్నలతో కూడిన పరీక్షను నిర్వహించి, శిక్షణ పూర్తయ్యే లోపు మోడల్ గ్రాండ్ టెస్టులను నిర్వహించనున్నట్లు వివరించారు. పరీక్ష పూర్తి అయిన వెంటనే పేపర్ వాల్యూయేషన్ చేసి, విద్యార్థుల ప్రతిభను తెలియపర్చి, తప్పుల సవరణపై సూచనలు చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9959085200, 8885995458, 9396992111 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్‌జేసీ పరీక్ష రాసే విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని, పాలిసెట్ అనంతరం ఇంగ్లిష్, బయాలజీ సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణకు అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. తొలుత పేర్లు నమోదు చేసుకున్న 150 మంది విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నల్లూరు సాంబశివరావు, కోశాధికారి కొండపనేని విజయకృష్ణ, సభ్యులు జొన్నలగడ్డ రమేష్, గుంటుపల్లి రఘునాథరావు పాల్గొన్నారు.

రొట్టెలు పంపిణీ

తెనాలి టౌన్: పట్టణంలో పలు ప్రాంతాల్లోని యాచకులకు మంగళవారం పాల్ అండ్ లూక్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రొట్టెలు పంపిణీ చేశారు. మినస్ట్రీస్ డైరెక్టర్ బ్రదర్ ఆనందన్న పంపిణీ చేశారు.